ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 1 అక్టోబరు 2024



నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 30: డీఎస్సీ-2024కి సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో 1:3కి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీఈవో రవీందర్ సోమవారం తెలిపారు. వారికి మంగళవారం నుంచి ఐదో తేదీ వరకు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరిశీలన ఉంటుందని, అన్ని ఒరిజనల్, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

డీసీసీ సారథ్యంపై.. కన్ను



- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నాయకుల భారీ ఆశలు
- ఒక్కో జిల్లాలో ముగ్గురి నుంచి నలుగురు ఆశావహులు
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల ప్రసన్నంలో బిజీబిజీ
- అధ్యక్షుల ఎంపికపై టీపీసీసీ చీఫ్, ముఖ్య నాయకుల కసరత్తు
- సభ్యత్వ నమోదులో బీజేపీ దూకుడు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): షెడ్యూల్ ప్రకారం మునిసిపాలిటీలు మినహా స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పటికే పూర్తి కావాలి. బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ, కులగణన నేపథ్యంలో ఇంకా అందుకు సంబంధించిన పనులు వేగిరం కావడం లేదు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో దాదాపుగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సూచనలు అందుతున్నాయి. ఈ లోపు పార్టీ కేడర్ విస్తరించుకోవడం, సభ్యత్వ నమోదును పెంచుకోవడం కోసం అన్ని ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. బీఆర్ఎస్‌కు ఇప్పటికీ స్థానిక సంస్థల్లో కేడర్ బలంగానే ఉంది. కొందరు లీడర్లు పార్టీలు మారినా.. పదేళ్ల అధికారంలో ఉన్న పార్టీ కావడంతో కేడర్ పూర్తిగా వీక్ కాలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సమానంగా సీట్లు సాధించిన భారతీయ జనతా పార్టీ.. ఇప్పుడు స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని భావిస్తోంది. ఇప్పటికే పార్టీ కేడర్ మొత్తం సభ్యత్వ నమోదులో నిమగ్నమైంది. దూకుడు పెంచి, మిస్డ్‌కాల్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల్లో అధిక స్థానాలు గెలుచుకోవడం ద్వారా అధికార పార్టీకి తామే ప్రత్యామ్నాయం కావాలని బీజేపీ ముఖ్య నాయకులు భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. పదేళ్ల అధికారానికి దూరంగా ఉండటంతో చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీ నాయకులు ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యారు. కానీ ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఘర్ వాపసీలో భాగంగా చాలా మంది తిరిగి వచ్చారు. ఇంకా వస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటం కాంగ్రెస్‌కు బలమే అయినప్పటికీ.. నిస్తేజంగా ఉన్న కేడర్‌ను ఉత్తేజం చేయడంతోపాటు, సీఎం సొంత జిల్లాలో ఎక్కువ స్థానాల్లో గెలుపొందాలనే ఆశ నాయకుల్లో ఉంది. అందుకు డీసీసీ కార్యవర్గం ఏర్పాటు, అధ్యక్షుడి ఎన్నిక కచ్చితంగా అవసరం. ఇటీవలే ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికున్న విషయం తెలిసిందే. తర్వాత మిగిలింది డీసీసీ సారథుల ఎన్నికనే. టీపీసీసీ కూడా ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుల ఎన్నికపై కసరత్తు ప్రారంభించింది. అధ్యక్ష స్థానాల కోసం ఆశావహులు భారీగా ఉన్నారు. నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కని నాయకులంతా డీసీసీ అధ్యక్ష లేదా కీలక పదవులు దక్కించుకోవాలని ఆశపడుతున్నారు. ఒక్కో జిల్లాలో ముగ్గురి నుంచి నలుగురు ఆశావహులు అధ్యక్ష పదవులు ఆశిస్తుండటంతో ఎంపిక కత్తి మీద సాముగా మారే అవకాశం ఉంది.

ఈ జిల్లాల్లో మార్పు తథ్యం..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా అధ్యక్ష బాధ్యతలను ఎమ్మెల్యేలకు లేదా ఇతర ప్రజాప్రతినిధులకే కేటాయించింది. పార్టీ తరఫున మరో పవర్ సెంటర్ ఉండకూడదనే విధానంలో ఈ నిర్ణయం తీసుకుంది. లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, రాజేందర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గట్టు యాదవ్ అలా ఉన్నవారే. అయితే కాంగ్రెస్ పార్టీలో ప్రభుత్వంతో సత్సమానంగా పార్టీది కూడా కీలకపాత్ర ఉంటుంది. అందుకే ఇప్పటికే ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిని అధ్యక్షులుగా కొనసాగించే అవకాశం ఉండకపోవచ్చు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడిగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన రెండింటిపై ఫోకస్ చేయడం కష్టం కానున్న నేపథ్యంలో మార్పు అనివార్యం కానుంది. ఈ క్రమంలో సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రి, ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్ అధ్యక్ష పీఠంపై కన్నేశారు. మైనారిటీల తరఫున సిరాజ్ ఖాద్రి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ద్వారా, ఎన్‌పీ వెంకటేశ్ ఒబేదుల్లా కొత్వాల్ ద్వారా, వినోద్‌కుమార్ తన సోదరుడు సంపత్‌కుమార్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. మైనారిటీలకు ఛాన్స్ ఇస్తే కచ్చితంగా సిరాజ్ ఖాద్రికి అవకాశం దక్కనుంది. జిల్లాలో బలమైన సామాజికవర్గం తరఫున ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్ ఇద్దరూ ఉన్నారు. బీసీలకు అవకాశం ఇస్తే ఇద్దరిలో ఒకరిని పదవి వరిస్తుంది. ఇక ఎస్సీ నుంచి వినోద్‌కుమార్ ఉండనే ఉన్నారు. వీరందరూ నామినేటెడ్ పదవులను ఆశించినప్పటికీ.. అవి రాలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ బాధ్యతల్లో ఉండగా, ఇక్కడా మార్పు అనివార్యమే. సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి నుంచి కేవీఎన్ రెడ్డి, మంత్రి జూపల్లి ప్రధాన అనుచరులైన రాంచంద్రారెడ్డి, ప్రతాప్‌గౌడ్ పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే అచ్చంపేట నుంచి శ్రీనివాస్‌రావు కూడా ఆశతో ఉన్నారు. నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డిని కొనసాగించే అవకాశం ఉంది.



మహబూబ్‌నగర్‌లోని డీసీసీ కార్యాలయం

ఆ రెండు జిల్లాల్లో కత్తిమీద సాము

ఉమ్మడి పాలమూరులో మూడు జిల్లాలది ఒకెత్తు.. వనపర్తి, గద్వాల జిల్లాలది మరో ఎత్తు అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తయారైంది. అక్కడ నాయకుల మధ్య వర్గపోరు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. వనపర్తి జిల్లాలో చిన్నారెడ్డి, మేఘారెడ్డి రెండు వర్గాలుగా ఉండగా.. ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే సహకారంతో అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. చిన్నారెడ్డి వర్గం నుంచి మొగిలి సత్యారెడ్డి అధ్యక్ష పదవిని కోరుతున్నారు. వీరు కాకుండా మేఘారెడ్డి వర్గం ఒక ఎస్సీ నాయకుడి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కూడా తిరిగి తనను ఎన్నిక చేయాలని కోరుతున్నారు. ఆధిపత్య పోరులో ఏ వర్గానికి ప్రాధాన్యం లభిస్తుందో వేచిచూడాలి. ఇక జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా ఆధిపత్య పోరు తీవ్రంగానే ఉంది. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తూ, ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీలో కొనసాగుతుండగా, వీరి మధ్య వైరం తీవ్ర స్థాయిలో ఉంది. ఆయన వర్గంలో ఉన్న డీసీసీ మాజీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరుకు బదులు అలంపూర్ నియోజకవర్గం నుంచి తాను ప్రపోజ్ చేసిన వ్యక్తికి డీసీసీ పదవి ఇవ్వాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరుతున్నారు. బీసీ వర్గానికి చెందిన ఆయన ప్రధాన అనుచరుడు షేక్షావలి ఆచారి లేదా ఎవరైనా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పదవి ఇప్పించాలని సంపత్ ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చాలా బాధ్యతలు వీరికి అప్పగించే అవకాశం ఉండటంతో ఆశావహులు కూడా ఎక్కువగానే ఉన్నారు.



ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో నిరుపయోగంగా మారిన మహిళా సంఘం భవనం

- మహిళా సమాఖ్యలకు నిర్వహణ నిధులు ఇవ్వని ప్రభుత్వం
- సమావేశాలు నిర్వహించకుండానే ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్న సీసీలు, బుక్ కీపర్లు
- సమష్టి నిర్ణయాలకు చెల్లిన కాలం
- రుణాల మంజూరులో చేతివాటం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 617 గ్రామ సంఘాలు..

నిధులు లేక..

అచ్చంపేట, సెప్టెంబరు 30: ఉమ్మడి రాష్ట్రంలో మహిళలను చైతన్య పరిచి, ఆర్థిక స్వావలంభన దిశగా అడుగులు వేసిన మహిళా సంఘాల సమావేశాలు నేడు కనుమరుగయ్యాయి. రోజుకో రూపాయి చొప్పున పొదుపు చేస్తూ, ప్రపంచంలో గుర్తింపు పొందిన మహిళలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న పథకాల గురించి తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకులు చెప్పిందే తీర్మానాలుగా రాసి పంపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సమష్టి నిర్ణయాలకు బదులు బుక్ కీపర్లు, సీసీలు తమకు అనుకూలంగా ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. నిర్వహణ ఖర్చులకు నిధులు లేకపోవడం వల్ల కూడా సమావేశాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది.

రుణాలు ఇలా..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 617 గ్రామ సంఘాలు ఉన్నాయి. అందులో 13,127 గ్రూపులు, 1,46,700 మంది సభ్యులు ఉన్నారు. మహిళలు పొదుపు చేసిన డబ్బులు బ్యాంకు లింకేజీ ద్వారా సంఘాలకు రుణాలుగా ఇస్తున్నారు. ఈ సంఘాలకు గత ఏడాది రూ.313 కోట్లా 20 లక్షలా 24 వేలు రుణాలుగా ఇవ్వాలని టార్గెట్ ఉండగా, 5,875 గ్రూప్‌లకు రూ.365.95 కోట్లు ఇచ్చారు. ఈ ఏడాది 9,299 గ్రూప్‌లకు రూ.362.88 కోట్ల టార్గెట్‌కుగాను ఇప్పటి వరకు 1,944 గ్రూప్‌లకు రూ.165 కోట్లు మాత్రమే రుణాలు ఇచ్చినట్లు సంబంధిత జిల్లా అధికారులు చెబుతున్నారు.

రుణాలలో చేతివాటం

మహిళ సంఘాలకు బ్యాంక్ లింకేజీల నుంచి రుణాలు ఇప్పించడంలో సీసీలు, బుక్ కీపర్లు కీలకపాత్ర పోషిస్తారు. సంఘాల సమావేశాలు జరుగకపోయినా.. జరిగినట్లు తీర్మానాలు చేసి, బ్యాంక్ అధికారులకు చెబుతున్నారు. ఈ క్రమంలో రుణాలు మంజూరైన సంఘాల నుంచి రూ.2,000 నుంచి రూ.3,000 వరకు వారు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమావేశాలు లేవు..

గ్రామ సంఘాల్లో ఏవైనా సమస్యలు ఉత్పన్నం అయితే మండల సమాఖ్యలో చర్చించి, పరిష్కరిస్తారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు ఉపాధి కల్పించేందుకు చర్చించుకొని సంఘంలోని సభ్యుల్లో కొందరిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చిన్న సంఘాలు, గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించకుండానే ఆయా గ్రామాల నాయకులు, సంఘాల బుక్ కీపర్లు తీర్మానాలు రాసి పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా తమకు వేతనాలు మంజూరు చేయాలని సీసీలు, బుక్ కీపర్లు కోరుతున్నారు.



అచ్చంపేటలోని మహిళా సమాఖ్య భవనంలో సమావేశమైన మహిళలు(ఫైల్)

సమావేశాలు నిర్వహించడం లేదు



నేను నేతాజీ సంఘంలో ఉన్నా. విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు కుడుతున్నా. కానీ ఇంత వరకు డబ్బులు ఇవ్వడం లేదు. మొదటి విడతగా 1,857 జతల డ్రెస్సులు కుట్టాము. రెండో విడతగా 3,300 డ్రెస్సులు కుట్టాలని పని చేస్తున్నాం. పొదుపు సంఘాల వల్ల బాగుపడ్డాం. కానీ గ్రామ సంఘాల మీటింగ్‌లు పెట్టి చర్చించుకుంటే ఒకరి కష్టాలు మరొకరికి తెలుస్తాయి.

- నస్రీన్ బేగం, ఉప్పునుంతల

మా పల్లె అందాలు



అలుగు పారుతున్న సింగోటం శ్రీవారి సముద్రం




మొక్కజొన్న చేను



మంచాలకట్ట వద్ద కృష్ణానదిలో నీట మునిగిన సంగమేశ్వరం గుడి



రోడ్డు పక్కన నిలిపిన ఎద్దుల బండి



గడ్డి తింటున్న ఎద్దు

పై ఫొటోలను చూస్తుంటే.. 'మా పల్లె అందాలు చూచుట కనువిందురో' అని ఓ కవి రాసిన పాటకు అద్దం పడుతున్నాయి. పచ్చని పొలాలు, నిండు కుండల్లా ఉన్న చెరువులు కనువిందు చేస్తున్నాయి. కొల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' సోమవారం క్లిక్ మనిపించింది.

- కొల్లాపూర్

రూ.1.73 కోట్లు దుర్వినియోగం

- పోలేపల్లి గ్రామ పంచాయతీలో వెలుగు
- నిజమైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపణ
- హరితహారంలో నాటని మొక్కలకు రూ.30 లక్షల బిల్లులు
- సీసీ కెమెరాల ఏర్పాటు పేరుతో రూ.16 లక్షల అవినీతి

జడ్చర్ల, సెప్టెంబరు 30: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామ పంచాయతీలో రూ.1.73 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారుల విచారణలో తేలింది. జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రికార్డుల టాంపరింగ్‌లకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చేసిన ఆరోపణ నిజమైంది. సర్పంచ్ చేతనరెడ్డి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యేకు బంధుత్వం ఉన్నా, అవినీతికి ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశంతో విచారణ చేపట్టాలంటూ అనిరుధ్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు డీఎల్‌పీవో పండరీనాథ్ గత నెల 18న పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో సరోజ, గ్రామ కార్యదర్శులు శివప్రసాద్, లక్ష్మీనారాయణ సమక్షంలో విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. కాగా విచారణలో 2019-2024 ఆర్థిక సంవత్సరాల్లో గ్రామ పంచాయతీ, రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్, పీఎఫ్ఎంఎస్ నిధులు రూ.6,81,57,355, 2019-20 సంవత్సరంలో ఓపెనింగ్ బ్యాలన్స్ రూ.1,38,69,878 కలిపి మొత్తం రూ.8,20,27,233 లావాదేవీలను నిర్వహించారు. అందులో రూ.7,3,79,148 ఖర్చు చేశారు. 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు రూ.కోటి 73 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు నివేదికలో పేర్కొనట్లు సమాచారం. దుర్వినియోగమైన మొత్తాన్ని సర్పంచ్ చేతనారెడ్డితో రికవరీ చేయాలని నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో, ఎంపీవో

దుర్వినియోగం అయిన నిధులు ఇలా..

గ్రామ సభ ఆమోదం, ఎలాంటి అనుమతులు, బిల్లులు లేకుండా నిధులు దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. హరితహారం కార్యక్రమంలో మొక్కలు కొనుగోలు చేసి, నాటినట్లు చెప్పి రూ.30.66 లక్షలు దుర్వినియోగం చేశారని విచారణలో బయటపడింది. 30 రోజుల పల్లె ప్రగతి పనుల కోసం ఎక్స్‌కవేటర్ల వినియోగానికి రూ.25,4,000, కలెక్టర్ పరిపాలన అనుమతులు లేకుండా సీసీ రోడ్ల నిర్మించినట్లు రూ.16 లక్షలా 75 వేలు, ఆనిమల్ క్యాచింగ్ కోసం రూ.3,17,000, సివిల్ వర్క్స్, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ఇతర పనుల నిమిత్తం రూ.33 లక్షలా 77 వేలు వెచ్చించినట్లు గుర్తించారు. విచారణలో అందుకు సంబంధించిన ఎంబీ రికార్డులు లేవని గుర్తించారు. మిస్‌లీనియస్ ఖర్చు కింద రూ.16 లక్షలా 13 వేలు ఖర్చు చేశారు. ఒకరికి రూ.తొమ్మిది లక్షలా 70 వేలు, మరో వ్యక్తికి రూ.60 వేలు అడ్వాన్స్‌లు ఇచ్చినట్లుగా గుర్తించారు. ఈ మొత్తాన్ని ఇప్పటికీ సర్దుబాటు చేయకుండానే ఆ వ్యక్తుల వద్ద ఉన్నట్లు గుర్తించారు. జె.రామచంద్రారెడ్డి అనే వ్యక్తికి రూ.తొమ్మిది లక్షలా 24 వేలు డ్వాన్స్‌లు చెల్లించారు. ఆ మొత్తం అతడి నుంచి తిరిగి రాబట్టలేదు. పనులు కూడా చేయించినట్లుగా లేకపోవడంతో దుర్వినియోగం అయినట్లుగా తేల్చారు. ఈజీఎస్ పథకం, హరితహారం మొక్కలకు ట్యాంకర్‌ల ద్వారా నీళ్లు అందించినట్లుగా రూ.14 లక్షలా 75 వేలు వెచ్చించినట్లుగా గుర్తించారు. అందులో రూ.11 లక్షలా 25 వేలు జె.రామచంద్రారెడ్డికి, రూ.మూడు లక్షలా 50 వేలు నర్సిములుకు చెల్లించినట్లుగా తేలింది. గ్రామంలో నర్సరీ నిర్వహణకు రూ.మూడు లక్షలా 80 వేల రూపాయలు వెచ్చించినట్లుగా తేల్చారు.

జూరాల ఐదు గేట్లు ఎత్తివేత

గద్వాల, సెప్టెంబరు 30: ఎగువ నుంచి వరద వస్తుండటంతో సోమవారం జూరాల ప్రాజెక్టు ఐదు గేట్లను ఎత్తి, నీటిని వదులుతున్నారు. మహారాష్ట్రలోని భీమా నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు జూరాల జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీకి 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అది జూరాలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు 68 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఐదు గేట్లు ఎత్తి 35,600 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,115 క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి జలాశయానికి 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 30 వేల క్యూసెక్కులను నారాయణపూర్‌కు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయానికి 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏడు గేట్లను ఎత్తి 32,100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయానికి 10 వేల క్యూసెక్కుల వరద ఉండగా, ఆ మొత్తాన్ని కాలువలకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 61 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 58 వేల క్యూసెక్కులను నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 190.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కందనూలు ఖాకీలకు ఏమైంది?

- వరుస సస్పెన్షన్లతో అబాసుపాలు
- పోలీసుల సంక్షేమానికి జిల్లా ఉన్నతాధికారుల చర్యలు
- అయినా కిందిస్థాయి సిబ్బందితో జనంలో పలుచన



నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా ఉన్నతాధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ కిందిస్థాయిలో కొందరు వ్యవహరిస్తున్న తీరు కందనూలు జిల్లాలో ఖాకీ వ్యవస్థకు మచ్చ తెస్తోంది. పేకాట రాయుళ్లు, ఇసుక మాఫియా, అసాంఘిక శక్తులతో కొందరు మిలాఖత్ అయి వ్యవహరిస్తున్న తీరు నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న సిబ్బందికి చెడ్డపేరు తెస్తోంది. సోషల్ మీడియాను ఆసరాగా చేసుకుని సామాన్య ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్న తీరు జుగుప్సాకరంగా మారుతున్నది.

● కొనసాగుతున్న సస్పెన్షన్ల పర్వం

జిల్లాలో ఇటీవల వివిధ సంఘటనల్లో పోలీస్‌శాఖలో సస్పెన్షన్ల పర్వం కొనసాగుతుండటం విమర్శలకు దారి తీస్తోంది. వెల్దండ మండలంలో ఓ హోటల్ యాజమాని నుంచి ఆరు వేల లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ, మరో కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత ఈ ఏడాది జూన్‌లో మైనింగ్‌కు ఉపయోగించే డిటర్నేటర్లను పట్టుకున్న పోలీసులు ఆ వ్యక్తిని కేసు నుంచి తప్పించడానికి 50వేల రూపాయలు డిమాండ్ చేసిన ఎస్ఐని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. బల్మూరు మండలంలో ఇసుక మాఫియాతో కుమ్మక్కైన ఎస్ఐ 20వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక యువతి మరొకరు కారులో కలిసి భోజనం చేస్తుండగా ఫోటోలు తీసిన ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు డిమాండ్ చేసి వేధించడంతో వారిద్దరు వేర్వేరుగా ఆత్మహత్యకు ప్రయత్నించారు.

ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ గంగారంలోని ఓ బాధితుడి వద్ద 2వేల రూపాయలు లంచంగా తీసుకోవడంతో జిల్లా ఎస్పీ అతన్ని ఆదివారం సస్పెండ్ చేశారు.

డీఆర్‌డీవోకు ఏపీఎం సరెండర్

కోయిలకొండ, సెప్టెంబరు 30 : మండలంలోని ఐకేపీ ఏపీఎం విజయకుమారిని డీఆర్‌డీవోకు సరెండర్ చేస్తూ ఎంపీడీవో కాళప్ప ఆదేశాలు జారీ చేశారు. మండలంలో మహిళా శక్తి రుణాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆమె పాల్గొనకపోవడం, నివేదికలు సకాలంలో అందించడం లేదన్న కారణంతో డీఆర్‌డీవోకు అటాచ్ చేసినట్లు ఆయన జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. సమావేశాలకు హాజరుకాకపోయినా, సకాలంలో నివేదికలు ఇవ్వకపోయిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి హాజరుకాని అధికారుల నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు వెల్లడించారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 30 : దసరా పండుగ పురస్కరించుకొని వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి జిల్లాలోని పది డిపోల ద్వారా మంగళవారం నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, తెలకపల్లి, డిండి గద్వాల్, అయిజ, కల్వకుర్తి, ఆమన్‌గల్, కొల్లాపూర్, కోస్గి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి నారాయణపేట, మద్దూర్, మరికల్, మక్తల్, షాద్‌నగర్, వనపర్తి, ఘనపూర్, పెబ్బేర్, కొత్తకోట తదితర ప్రాంతాలకు ఆయా డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. డిపోల నుంచి హైదరాబాద్‌కు నడిచే బస్సులు అచ్చంపేట నుంచి 105, గద్వాల నుంచి 89, కల్వకుర్తి నుంచి 67, కొల్లాపూర్ నుంచి 58, మహబూబ్‌నగర్ నుంచి 69, నాగర్‌కర్నూల్ నుంచి 53, నారాయణపేట నుంచి 54, షాద్‌నగర్ నుంచి 59, వనపర్తి నుంచి 95 బస్సుల నడపనున్నట్లు తెలిపారు. ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్టోబర్, నవంబరు మాసంలో అధిక పెళ్లి ముహూర్తాలు, ఇతర శుభకార్యాలను దృష్టిలో ఉంచుకొని బస్సులను అద్దె ప్రతిపాదికన 10 శాతం రాయితీతో, డిపాజిట్ లేకుండా అందిస్తున్నామని తెలిపారు. అవసరం ఉన్న వారు బస్సులను బుక్ చేసుకోవాలని, వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

సెమీస్‌కు చేరిన మహబూబ్‌నగర్

-90 పరుగులతో మెదక్‌పై గెలుపు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 30: హెచ్ సీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు సెమీస్‌కు చేరింది. సోమవారం వరంగల్ స్పోర్ట్స్ బాక్స్ స్టేడియంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్లు తలబడ్డాయి. 90 పరుగుల తేడాతో మెదక్‌పై ఘన విజయం సాధించి మహబూబ్‌నగర్ జట్టు సెమీస్‌కు చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 102 బంతుల్లో ఆరు ఫోర్లతో (54 పరుగులు), అభిలాష్ 104 బంతుల్లో ఆరు ఫోర్లు, 2 సిక్స్‌లతో (66 పరుగులు), షాదాబ్ అహ్మద్ 44 బంతుల్లో ఏడు ఫోర్లు, సిక్స్‌తో (53 పరుగులు) చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకు కుప్పకూలింది. జట్టులో రాహుల్‌నాయక్ 36 పరుగులు సాధించాడు. జిల్లా బౌలర్లలో షాదాబ్‌అహ్మద్ నాలుగు, ముఖీత్ రెండు, అంకిత్‌రాయ్ రెండు వికెట్లు తీసి జిల్లా జట్టు విజయానికి కృషి చేశారు. ఆల్‌రౌండర్ షాదాబ్‌అహ్మద్ బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో నాలుగు వికెట్లు తీసి జట్టు విజయానికి కీలకపాత్ర పోషించాడు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

జడ్చర్ల, సెప్టెంబరు 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో వేర్వేరు ప్రాంతాలలో జరిగిన మూడు చోరీ కేసులలో ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని భవానీనగర్‌లో వడ్ల గోపి ఇంట్లో జూలై 30న, ఇంపీరియల్ గార్డెన్స్ సమీపంలో నరేంద్ర సాగర్ ఇంట్లో ఆగస్టు 19న, అలాగే క్లబ్‌రోడ్డులో హసన్‌అలీఖాన్ ఇంట్లో సెప్టెంబరు 14న చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. పట్టణంలోని ఎర్రగుట్ట ప్రాంతానికి చెందిన చిట్యాలరవి, వెంకటేశ్వరకాలనీకి చెందిన లింగాల మహేష్‌లు చోరీకి పాల్పడ్డారని విచారణలో తేలిందని చెప్పారు. వీరి వద్ద మూడు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ శివానందం, కానిస్టేబుళ్లు ఉన్నారు.

పట్టపగలే నాలుగు ఇళ్లలో చోరీ

కేటీదొడ్డి, సెప్టె ంబర్ 30: పట్టప గలే నాలుగు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మం డలంలోని యర్స న్‌దొడ్డి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామ స్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మధ్యా హ్నం అందరూ పొలాలకు వెళ్లిన సమయంలో నాలుగు ఇళ్ల తాళాలు పగులకొట్టి బంగారు ఆభరణాలను, కొంత నగదును దోచుకెళ్లారు. సాయంత్రం పొలం పనులు ముగించుకొని తమ ఇళ్లకు చేరుకున్న బాధి తులు ఇళ్ల తాళాలు పగులకొట్టి ఉండడం గమనించారు. శ్రీదే వి, పద్మమ్మ, లక్ష్మీ, రాజులకు చెందిన ఇళ్లల్లో మొత్తం రూ.1.60 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను, నగదు ను దోచుకెళ్లినట్లు బాధితులు గుర్తించారు. విషయం తెలుసు కున్న ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం ద్వారా వేలి ముద్రలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూత్పూర్‌లో నగదు అపహరణ

భూత్పూర్, సెప్టెంబరు 30: మునిసిపాలిటీ కేంద్రంలోని చౌరస్తాలో ఓ దుకాణంలో దుకాణం తాళాలను విరగొట్టి రూ. 20వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా.. అన్నపూర్ణ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగొట్టి కౌంటర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. సోమవారం ఉదయం షాపును తెరిచి చూడగా చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. యజమాని నగేష్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు పరిశీలించారు.

గద్వాలలో కిరాణ దుకాణంలో చోరీ..

గద్వాల క్రైం, సెప్టెంబరు 30: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో ఉన్న కిరాణ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగి రూ. 24వేలు దొంగలు ఎత్తికెళ్లినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి సోమవారం ఉదయం తెరువగా షాపు వెనుక భాగంలో ఉన్న పై కప్పును తొలగించి రూ. నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్సీలో మెరిసిన అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 30: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో తమ ప్రతిభను చాటారు. పలువురు టాప్ పది ర్యాంకుల్లో నిలిచారు. ఈ సందర్భంగా వారికి ఉద్యోగం ఖాయం కావడంతో ఆనందంలో మునిగారు.

డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో పాలమూరు విద్యార్థులు పలువురు ప్రతిభ కనబరిచారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎం. అశోక్‌కుమార్ సమగ్ర శిక్ష విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించారు. అదేవిధంగా గోపాల్ గణిత విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠ శాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 84.37 మార్కులు తెచ్చుకున్నారు.


గోపాల్


అశోక్‌కుమార్, మహబూబ్‌నగర్

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన గవినోళ్ల రఘురామేశ్వర్‌రెడ్డి జిల్లా మొదటి ర్యాంకును సాధించాడు. ప్రైవేట్ బ్యాంకులో ఎస్‌ఓగా పనిచేస్తూ డీఎస్సీ ఫలితాల్లో 71.47 శాతం మార్కులతో ఎస్‌ఏ (గణితం) ఉద్యోగం సాధించాడు.


రఘురామేశ్వర్‌రెడ్డి

అయిజ: భాషా పండిట్ హిందీలో గద్వాల జిల్లా స్థాయిలో అయిజ మండలంలోని కుట్కనూర్ చెందిన కే.శ్రీనివాసులుకు మొదటి ర్యాంకు లభించింది. 66.53 మార్కులు వచ్చినట్లు తెలిపారు.


శ్రీనివాసులు

పెంట్లవెలి: నాగర్‌కర్నూల్ జిల్లాలో 73.04 మార్కు లు సాధించి రెండవ ర్యాంకర్‌గా మల్లేశ్వరం చెందిన మధుగంరాము ఎస్జీటీలో ఉద్యోగం సాధించాడు.


మధుగం రాము

వీపనగండ్ల: వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని కల్వరాల చెందిన ముగ్గురు అభ్యర్థులు డీఎస్సీలో ర్యాంకులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో రవికుమార్ జిల్లా మొదటి ర్యాంకు, ఎస్జీటీలో భాగ్యలక్ష్మి 12వ ర్యాంకు, సుష్మిత 14వ ర్యాంకు సాధించారు.


స్వప్న, ఊట్కూర్


ప్రదీప్‌కుమార్, ఊట్కూర్


జి. పియాంక, ఊట్కూర్

ఊట్కూర్: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని కొల్లూర్ చెందిన స్వప్న స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంక్, ఎడవెల్లికి చెందిన ప్రియాంక ఎస్జీటీలో మొదటి ర్యాంక్‌ను సాధించింది. ఊట్కూర్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ తెలుగు పండిట్ విభాగంలో రెండో ర్యాంక్ సాధించారు.

మానవపాడు: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని అమరవాయి చెందిన ఖబుల సాబ్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు పండిట్ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన షేక్ ఇమ్రాన్ హిందీలో జిల్లా రెండో ర్యాంకు సాధించారు.


ఇమ్రాన్

ధరూరు : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం మారబీడు చెందిన ఏ. నరేష్ డీఎస్సీ (పీఈటీ) సబ్జెక్టులో 70 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు.


ఖబుల సాబ్,

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని నీలిపల్లికి చెందిన తిమ్మప్ప కుమారుడు డి.పృథ్వీరాజ్ జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు.


డి.పృథ్వీరాజ్

నడిగడ్డ యువత మత్తుకు బానిసకావొద్దు

- ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

- దీక్షకు సంఘీభావం ప్రకటించిన పార్టీలు

గద్వాల టౌన్, సెప్టెంబరు 30 : ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం నడిగడ్డలో విచ్చలవిడిగా సాగుతున్న నిషేధిత మత్తు పదార్థాల విక్రయంపై అధికారులు ఉక్కుపాదం మోపాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లో ఒక రోజు నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగి మత్తుకు బానిసలు కావద్దని యువతను కోరారు. నడిగడ్డలో నిషేధిత, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారం జోరుగా సాగేందుకు పరో క్షంగా వారికి రాజకీయ అండదండలు లభిస్తుండటం ఆందోళనకరమన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఉక్కు పాదంతో అణచివేసే బాధ్యత అధికారులదేనన్నారు. గంజాయి మత్తులోనే ఇటీవల మహిళలపై దాడులు, లైం గిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతుండటం వెలుగు చూస్తున్నా పాలకుల్లో స్పందన లేకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. మత్తు పదార్థాలకు బాని సలయ్యే యువత విచక్షణ కోల్పోయి అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉంటు ందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచి వారిని కట్టడి చేయాలన్నారు. త్వరలోనే తమ పోరాట సమితి ఆధ్వర్యంలో తగిన కార్యచరణ సిద్ధంచేసి నిషే ధిత మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. దీక్షకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రా ములు, వీహెచ్‌పీ ఎర్ర జనార్దన్, బీఆర్ఎస్ సునంద్, మహ్మద్ రఫీ సంఘీభావం ప్రకటించారు. బుచ్చిబాబు, లవన్న, రంగస్వామి, వెంకట్రాములు, గౌని శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, ఇంతియాజ్, గోపాల్, గోవిందు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న రంజిత్‌కుమార్, నాయకులు

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

పాన్‌గల్, సెప్టెంబరు 30 : హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు శిక్షణ పడినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలి పారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కేతేపల్లికి చెం దిన చెందిన గాలిగళ్ల మునిస్వామి తన ఇంటి వద్ద బాత్రూం గుంత గురించి శేఖర్ గొడవపడ్డాడు. పాత కక్షలు మనసులో పెట్టుకొని తన ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకుని వచ్చి ముని స్వామి భార్య మైబుసమ్మ తలపై కొట్టగా తీవ్ర గాయమైంది. అడ్డుగా వెళ్లిన మునిస్వామిని కూడా కొట్టడంతో ఫిబ్రవరి ఒకటో తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ ఐ వేణు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోమ వారం సీనియర్ సివిల్ కోర్టు వనపర్తిలో 12 మంది సాక్షు లను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, కానిస్టేబుల్ స్వామి జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా సీనియర్ సివిల్ జడ్జి రజ ని నేరం రుజువు కావడంతో శేఖర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించడం జరిగిందన్నారు.

మహిళపై లైంగిక దాడి కేసు నమోదు

గద్వాల, సెప్టెంబరు 30: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత మహిళపై లైంగిక దాడి జరిగింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బాధిత మహిళ 26వ తేదిన సాయంత్రం ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గట్టు, సెప్టెంబరు 30 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి శివారులో ఆదివారం రాత్రి ఎదురుదెరుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా.. కర్ణాటకలోని కురిడి గ్రామానికి చెందిన చిన్న (30) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని భార్యను చూడడానికి తాటికుంటకు వస్తుండగా ఆదివారం సాయంత్రం గొర్లఖాన్‌దొడ్డి సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. అంబులెన్స్‌లో గద్వాల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూల్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అజాగ్రత్తగా వాహనం నడిపి మృతికి కారణమైన తుమ్మిళ్లకి చెందిన మల్లికార్జున్‌పై బాపూరి తాయప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువకు మరమ్మతు చేపట్టిన అధికారులు

వెల్దండ, సెప్టెంబరు 30 : డీ-82 కాలువకు పడిన గండికి సోమవారం ఇరిగేషన్ అధికారులు మరమ్మతు చేశారు. 'డీ-82 కాలువకు మరమ్మతు చేపట్టండి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశానుసారం ఇరిగేషన్ డీఈ సమ్మన్న పర్యవేక్షణలో యంత్రాల సహాయంతో కాలువ గండిని పూడ్చారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గండి పూడ్చడంతో సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

- ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించిన కార్యదర్శి జితేందర్

- అండర్ 14, 17లో తలబడిన జట్లు

ఉండవల్లి, సెప్టెంబరు 30: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడాస్ఫూర్తిని అలవరుకోవాలని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. జితేందర్ అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అండర్ 14, 17 బాలురు విభాగంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్, జీహెచ్ఎం హేమలత, రాజోళి ఎంఈవో భగీరథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా పాఠశాల స్థాయి ఆటల పోటీలను జిల్లాలోని ప్రతి మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలా చేయడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఆటలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించే అవకాశం ఉందన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు జోనల్ స్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


అండర్-14 విజేతకి బహుమతి అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి


అండర్-17 విభాగంలో విజేతగా నిలిచిన కేటీదొడ్డి మండలం జట్టు

విజేతలుగా గద్వాల, కేటీదొడ్డి జట్లు

అండర్ - 14, 17 బాలుర విభాగంలో జిల్లాలోని 12 మండలాల్లో రెండేసి జట్లతో 24 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాగిన పోటీలో ఫైనల్‌లో అండర్-14 కేటీదొడ్డి, గద్వాల మండలం జట్లు తలపడగా విజేతగా గద్వాల, రన్నర్‌గా కేటీదొడ్డి నిలిచాయి. అండర్-17 విభాగం ఫైనల్‌లో కేటీదొడ్డి మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానం ధరూర్ జట్టు నిలిచింది. విజేతలకు షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో భరత్‌కుమార్, గోద జయన్న, చిన్న నాగేంద్రం, గోవిందు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, పీడీ శైలజ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 30: పాలమూరు యూనివర్సిటీలో ఎంఈడీ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న జయనాయక్‌కు డాక్టరేట్ దక్కింది. జయనాయక్ డాక్టరేట్‌గా ప్రకటిస్తూ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రకటన సోమవారం విడుదల చేసింది. ఇక్కడే చదివి అధ్యాపకురాలిగా నియామకమై, డాక్టరేట్‌ను సాధించినందుకు పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

గణితశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ

అమ్రాబాద్ సెప్టెంబర్ 30: మండల పరిధిలోని కుమ్మరోనిపల్లికి చెందిన మోటమారి మధు గణిత శాస్త్ర విభాగంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ మధు గతంలో పదేళ్ల పాలమూరు యూనివర్సిటీలో గణిత విభాగ అధిపతిగా పనిచేశారు. ఈ సందర్భంగా పీయూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


ప్రొఫెసర్ మధు

వాలీబాల్ అకాడమీకి ముందడుగు

- ఏడాది క్రితం ఎంపికలు పూర్తి

- ప్రభుత్వం మారడంతో ప్రారంభానికి బ్రేక్

- వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి..

- స్టేడియం చేరిన వంటసామగ్రి, బెడ్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 30: మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో వాలీబాల్ అకాడమీని రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అకాడమీలో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయి ఎంపిక కూడా మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన 20 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. అకాడమీలో చేరేందుకు తమకు పిలుపువస్తుందని వారంతా కొన్ని నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఏడాది దాటినా అకాడమీ ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. ఇటీవలే ఇండోర్‌స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి వాలీబాల్ అకాడమీ ప్రారంభించేందుకు హామీ ఇచ్చారు. ఈ అకాడమీ ప్రారంభోత్సవానికి జిల్లా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.


మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

వంట సామగ్రి, బెడ్లు సిద్ధం


వాలీబాల్ అకాడమీకి అవసరమైన మౌలిక వసతుల కోసం గతేడాది చివరల్లో డీఎస్ఏ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)కు ప్రతిపాదనలు పంపించింది. ఆ మేరకు రూ.3.70లక్షల విలువైన వంట సామగ్రి స్టేడియానికి చేరింది. రూ. 3లక్షల పైచిలుకు నిధులతో 40 ఇనుప మంచాలు వచ్చాయి. వాటిపై వేసేందుకు పరుపులు, బ్లాంకెట్ తదితరాలు రావాల్సి ఉంది. డైనింగ్ టేబుళ్లు రావాల్సి ఉంది. భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టు ఇచ్చేందుకు ప్రక్రియ పట్టాలెక్కాల్సి ఉంది. పిల్లలకు మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అందించే పౌష్టికాహారం తదితరాలకు గుత్తేదారు కోసం జిల్లాలో అన్వేషిస్తున్నట్లు సమాచారం. బాల, బాలికలకు ప్రత్యేక కోచ్‌లను నియమించాల్సి ఉంది. ఈ పక్రియను ఈ విద్యా సంవత్సరంలో చేపడితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందనుకున్నా సాధ్యం కాలేదు. ఇప్పటికే విద్యా సంవత్సరం ముగిసింది.


వసతి కోసం సిద్ధం చేసిన గదులు

రూ.19లక్షలతో వసతులు..

అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ద్వారా రూ.19లక్షల వరకు నిధులు విడుదల చేసింది. వాటితో మైదానంలో రెండు వాలీబాల్ కోర్టులు సిద్ధం చేశారు. ప్లే ఫీల్డ్ గోడలకు చిత్రాలు కూడా వేశారు. క్రీడాకారులకు వసతి కల్పించేందుకు ఈతకొలను పైఅంతస్తులోని గదులకు మరమ్మతు చేశారు. బండలు వేసి పెయింటింగ్ వేసి రూంలను సిద్ధం చేశారు.

త్వరలో ప్రారంభోత్సవానికి చర్యలు..



వాలీబాల్ అకాడమీ త్వరలో ప్రారంభించేందుకు శాట్స్ దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన పనులు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన సదుపాయాలు కల్పిస్తే ఎంపికైన క్రీడాకారులతో అకాడమీ ప్రారంభిస్తాం. ఇద్దరు కోచ్‌లు, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. గతంలో ఎంపికైన వారితో పాటు, మరోసారి కొత్త వారికి అవకాశం కల్పించి ఎంపికలు చేపడతాం.

-ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయం

- స్వచ్ఛతా హీ సేవా జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు



తాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసులు

తాదూరు, సెప్టెంబరు 30 : గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని స్వచ్ఛతా హీ సేవా జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామాల్లో ఉన్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్‌పీవో రామ్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమ నిర్వాహకులను ఎంపీవో బ్రహ్మచారి, పీఎస్ పవన్, మండల పంచాయతీ కార్యదర్శులు అందరినీ అభినందించారు. జీపీ సిబ్బందికి శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ మెడికల్ క్యాంపులో 87మంది మల్టీపర్పస్ వర్కర్స్‌కు టెస్టులు నిర్వహించగా 17మందికి బీపీ, ఐదుగురికి షుగరు ఉన్నట్లు తేలింది. వీరికి మెడిసిన్ ఇవ్వామని, అలాగే రెగ్యులర్‌గా ఈ వర్కర్స్‌ను ఫాలోప్ చేయాల్సిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్ అభిరామ్, డాక్టర్ సురేష్, సీహెచ్‌వో అహ్మద్ ఆలీ, పీహెచ్‌ఎన్ కృపమ్మ, గ్రామపంచాయతీ కార్యదర్శులు పవన్, వెన్సీ, నాశ్రీన్, వినోద్ మొదలగు 24 గ్రామపంచాయతీల కార్యదర్శులు సూపర్‌వైజర్లు జ్యోతి, రజిత, ఫార్మాసిస్టు రజిని, లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, దాసు, కార్యదర్శి పవన్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● అమ్రాబాద్: ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్స్ సిబ్బంది 92 మందికి డాక్టర్ రమాకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అమ్రాబాద్ ఎంపీడీవో వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితరులు ఉన్నారు.

● కల్వకుర్తి: స్వచ్ఛతా హీ సేవాపైన పట్టణ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. పట్టణంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఆర్.శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసేంత వరకు పోరాటం ఆగదు



పెంట్లవెల్లిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పెంట్లవెల్లి, సెప్టెంబరు 30: పెంట్లవెల్లి సొసైటీ పరిధిలో ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేసేంత వరకు పోరాటం ఆగదని సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంట్లవెల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో 499 మంది రైతులు రుణాలు తీసుకుంటే ఏ ఒక్క రైతుకు కూడా రుణమాఫీ కాకపోవడం దారుణమన్నారు. మంత్రి జూపల్లి చొరవ తీసుకుని రైతులకు రుణమాఫీ అయ్యేటట్లు చూడాలన్నారు. రైతులకు రుణమాఫీ చేసేంత వరకు పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. రోడ్లపై ఎక్కడికక్కడ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఆగిపోవడంతో పోలీసులు వచ్చి ఆందోళన విరమింప చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, రైతులు సురేందర్‌గౌడ్, సీఎం కురుమయ్య నాగరాజు, సురేందర్‌రెడ్డి, రాము ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తెలకపల్లి, సెప్టెంబరు 30 : మండల కేంద్రంలోని శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్లో స్వేరోస్, విస్‌డమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల బహుమతుల ప్రదానం కార్యక్రమంలో తెలకపల్లి మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధతో చదివి మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. విద్యతోనే పేదరికం తొలగించవచ్చని తెలియజేశారు. నిర్వాహకులు స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించగా సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేశారు. ఈ పోటీల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తెలకపల్లి మండలానికి మొదటి బహుమతి ప్రాపుణ్య, రెండవ బహుమతి భరణి, కెరలిన్, మూడో బహుమతి నాగర్‌కర్నూల్‌కు చెందిన రోషన్‌లు గెలుచుకున్నారని తెలియజేశారు. అనంతరం బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ సురేందర్, ప్రిన్సిపాల్ దీపసెబాస్టియన్, ఉపాధ్యాయులు పరశురాములు, రమేష్, తిరుపతయ్య, వెంకటేష్, స్వేరో నాయకులు సంపత్‌కుమార్, మబ్బు రాము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ నిరసన

కొల్లాపూర్, సెప్టెంబరు 30: దేవాలయాల పరిరక్షణకు ప్రతీ హిందువు కదిలి రావాలని విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం కొల్లాపూర్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ పురేందర్ మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ వివాదంపై నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో గోవింద నామస్మరణ చేస్తూ.. పట్టణంలోని పురవీధుల వెంట నామసంకీర్తన చేశారు. బజరంగ్‌దళ్ పట్టణ సంయోజక్ పులి భరత్, గోసంరక్షణ సంయోజక్ మహేష్, బీజేపీ నాయకులు సందు రమేష్, మెంటే శివకృష్ణ, కాశిపురం మహేష్, గోపాలకృష్ణ, మహేష్, కన్నయ్య, లక్ష్మణ్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

కొల్లాపూర్, సెప్టెంబరు 30 : హమాలీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సురభి రాజా బంగ్లా ముందు హమాలీ కార్మికులతో సీఐటీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఈశ్వర్ మాట్లాడుతూ హమాలీ కార్మికులు రాష్ట్రంలో ప్రభుత్వానికి ప్రతిసంవత్సరం రెన్యువల్స్ రూపంలో లక్షల రూపాయలు చెల్లిస్తున్నారని, అయినా వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, హమాలీ నాయకులు బాలయ్య, శ్రీనివాసులు, రాజేష్, చిరంజీవి, రవి, గంగన్న పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి'

వెల్దండ, సెప్టెంబరు 30 : బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దుర్గాప్రసాద్ పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. మండల అధ్యక్షుడు యాదగిరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్యయాదవ్, రామకృష్ణ, నీలకంఠ, దశరథం, శ్రీశైలం, గెల్వయ్య, శివప్రసాద్,దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

లింగాల, సెప్టెంబరు 30 : లింగాల సమీపంలోని ధారారం రోడ్డుకు వెళ్లే మార్గంలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహాన్ని అంగోత్ దేవేందర్(22)గా గుర్తించినట్లు అచ్చంపేట సీఐ రవీందర్ సోమవారం తెలిపారు. గత మూడు రోజుల క్రితం మండల కేంద్రానికి సమీపంలో పంట పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లుగా తెలియడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. మృతుడి దగ్గర ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు లింగాలకు చెందిన అంగోత్ దేవేందర్‌గా గుర్తించినట్లు తెలిపారు. లింగాలకు చెందిన కంప లింగస్వామి, ఉలస్ శంకర్ అనే రైతులు మొక్కజొన్న పంటలను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు దేవేందర్ రోడ్డు వెంబడి వస్తుండగా బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ కంచెలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనలో ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం అనంతరం మృతుడి కుటుంబానికి అందజేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి తల్లి అంగోత్ సోమి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఆసుపత్రి స్థాయి 330 పడకలకు పెంపు

- రోగులకు అధునాతనమైన వైద్య సేవలందించేందుకు కృషి
- వినియోగంలోకి రానున్న సిటీ, స్కిఫా స్కాన్‌లు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజలకు ఆధునాతనమైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఆధునాతనమైన వైద్య సేవలు అందించేందుకు చేస్తున్న కృషి వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి వైద్య సేవలు అందించగలుగుతున్నామని చెప్పిన ఆయన ఆసుపత్రిని వంద నుంచి 330పడకల స్థాయికి పెంపొందించనున్నట్లు చెప్పారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు...

ప్రశ్న: సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు..

జవాబు: జిల్లాలో ప్రజాప్రతినిధుల సహకారం అన్ని వర్గాల తోడ్పాటుతో మెరుగైన వైద్య సేవలందించేందుకు నిత్యం కృషి చేస్తున్నాం. దీని కారణంగానే 150 నుంచి 1500వరకు అవుట్ పేషెంట్ల సంఖ్య పెరిగింది.

ప్రశ్న: అధునాతనమైన వైద్య సేవలు ఎన్ని అందుబాటులోకి వచ్చాయి..

జవాబు: ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీలు, ఈఎన్‌టీ, చర్మ వ్యాధులు, ఆప్తాలమాజీ, సైక్రియాటిస్టు సేవలు అందుబాటులోకి వచ్చాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలు వెచ్చించలేని స్థితిలో ఉన్న సిటీ, స్కిఫా స్కాన్‌లు అందుబాటులోకి రావడం కారణంగా వైద్యానికయ్యే ఖర్చు బాగా తగ్గింది. జిల్లా కేంద్రంలోనే అవన్నీ అందుబాటులోకి రావడం కారణంగా మహబూబ్‌నగర్, హైదరాబాద్ లాంటి ప్రదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేదు.

ప్రశ్న: డయాలసిస్ రోగులకు ఏమైనా వెసులుబాటు కల్పించారా..

జవాబు: వారి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. డయాలసిస్ రోగుల కోసం కేవలం ఐదు బెడ్లు మాత్రమే ఉండగా వాటిని పది పడకలకు విస్తరించాం. నెలకు దాదాపు 50మంది డయాలసిస్ రోగులకు 350 నుంచి 400సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వారి కోసం ప్రత్యేకంగా ఒక గదిని కూడా నిర్మించాలని తల పెట్టాం.

ప్రశ్న: జిల్లా ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెరిగిందా..

జవాబు: మున్మాటికీ పెరిగింది. గతంలో నెలకు వంద ప్రసవాలు జరగగా.. ఇటీవల కాలంలో 400 నుంచి 500వరకు డెలివరీలు జరుగుతున్నాయి. జనరల్ సర్జరీ విభాగంలో వంద ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఆర్థోపెడిక్స్‌లో 50 నుంచి 70, జనరల్ మెడిసిన్ విభాగంలో పాయిజన్, పక్షవాతం, పాముకాటు కేసులు నమోదవుతున్నాయి.

ప్రశ్న: ఆపరేషన్ థియేటర్లు సరిగ్గా లేవనే విమర్శలు నిజమేనా..

జవాబు: జిల్లా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల కారణంగా అనేక విభాగాలలో సర్జరీల కోసం రద్దీ పెరిగిన మాట వాస్తవం. ఇప్పటి వరకు కేవలం రెండు ఆపరేషన్ థియేటర్లు మాత్రమే ఉండగా కొత్తగా ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ నిర్మించాలని తలపెట్టాం. దీనికారణంగా మరో మూడు ఆధునాతనమైన ఆపరేషన్ థియేటర్లు వినియోగంలోకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి.

ప్రశ్న: ఏడాదిలోపు చిన్న పిల్లలకు ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయట..

జవాబు: ఇందు కోసం నెలలోపు చిన్న పిల్లల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అభ్యర్థన మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు 20లక్షల రూపాయల నిధులను కేటాయించారు. దీని ద్వారా వారికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నాం.

ప్రశ్న: ఎయిడ్స్ రోగులకు ప్రత్యేక చికిత్స కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయా..

జవాబు: అవును. ఇందు కోసం ప్రత్యేకంగా ఏఆర్‌పీ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్యేక వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఎయిడ్స్ రోగుల జీవన సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలకు శ్రీకారం చుట్టాం.

ప్రశ్న: పారిశుధ్యం పేలవంగా ఉందన్న విమర్శలకు మీ సమాధానం..

జవాబు: ఇది నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలోనే ఉన్న సమస్య కాదు. పారిశుధ్య సిబ్బంది విషయంలో హైకోర్టులో కేసు నడుస్తున్న కారణంగా సమస్య తలెత్తుతున్నది. జిల్లా ఆసుపత్రికి 150మంది పారిశుధ్య సిబ్బంది అవసరం కాగా కేవలం 35మందితో పనులు పూర్తి కానిస్తున్నాం. దీనికి సంబంధించిన అంశాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకు నివేదించాం. త్వరలోనే అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

మెరుగైన వైద్య సేవలందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



వైద్యుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 30: ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ప్రభుతో పాటు వైద్య సిబ్బందితో అత్యవసర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతానన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలోని మెడికల్ వార్డు, డయాలసిస్ సెంటర్, గైనిక్ వార్డులను పరిశీలించి పేషెంట్లను వారికి అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పొందాలి

ప్రతీ విద్యార్థి క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సోమవారం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. జోనల్ స్థాయి క్రీడల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడతారన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు బాసటగా అంగన్‌వాడీలు



బల్మూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో దమయంతి

బల్మూరు, సెప్టెంబరు 30 : వయోవృద్ధులకు సహాయ సహకారాలందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కృషి చేస్తామని బల్మూరు ప్రాజెక్టు సీడీపీవో దమయంతి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఐదవ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వయోవృద్ధుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబాల్లో వయోవృద్ధులకు సక్రమంగా చూసుకోకుంటే అంగన్‌వాడీలో ఫిర్యాదు చేస్తే కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించే విధంగా చూస్తామని, లేని పక్షంలో వృద్ధాశ్రమంలో చేర్పించడానికి కృషి చేస్తామని వారన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పోషణ అభియాన్ టీచర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు నీలాబాయి, శ్రీదేవి, భాగ్యమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: కుటుంబ ఉన్నతికి అవిశ్రాంతంగా కష్టపడి జీవిత చరమాంకంలో ఉన్న వయోవృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తగా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రశాంత నిలయం వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు పండ్లు అందజేసి మాట్లాడారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు వృద్ధులకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారని, వేళకు ఆహారం, మందులు వంటివి ఇస్తున్నారా లేదా అని వాకబు చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి వెంట ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్, పంచాయతీ సిబ్బంది శ్రీశైలం, యశ్వంత్ కుమార్, ప్రశాంతి నిలయం ఇన్‌చార్జి మెర్సీ, అసిస్టెంట్ నర్సులు జీనిత, ప్రవ, బ్రిగిట తదితరులు ఉన్నారు.

● అచ్చంపేటటౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని 10వ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమృత మాట్లాడారు. చిన్నారులకు భవిష్యత్తుకు బాటలు దిద్దే బాట సారులుగా వృద్ధులు ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ సంధ్య, సుగుణ లలిత, భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

● కల్వకుర్తి: పట్టణంలో డీడబ్ల్యూవో, పీటీఎస్ అండర్ మేనేజ్‌మెంట్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో సోమవారం సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్లు హాజరై వృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వృద్ధులకు సీడీపీవో భాగ్యమ్మ పండ్లు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు పద్మావతి, లక్ష్మీదేవమ్మ, ఆలివేల, నిర్వాహకులు పి.వెంకటయ్య, హోం కోఆర్డినేటర్ పద్మమ్మ, అసిస్టెంట్ హోం కో ఆర్డినేటర్ పరమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్ రాములమ్మ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి సన్మానిస్తున్న సీడీపీవో భాగ్యమ్మ

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కొల్లాపూర్, సెప్టెంబరు 30 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.వెంకటయ్య అధ్యక్షతన బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు వివిధ రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి భారత సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ బొడ్డెమ్మలతో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన బతుకమ్మలతో గౌరమ్మకు పూజలు నిర్వహించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ ఆర్.స్వర్ణలత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్, సెప్టెంరబు 30 : పట్టణంలోని ఆర్ఐడీ ఉన్నత పాఠశాల రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి పాఠశాలలో లేకుండా వెళ్లిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఐడీ పాఠశాలకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులకు విద్యార్థులు మాత్రమే దర్శనమివ్వడం ఉపాధ్యాయులు లేకపోవడం గమనించి చర్యలు తీసుకోవాలని వారు డీఈవోకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలపై ఉన్నత విద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లక్నారం గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలి

తెలకపల్లి, సెప్టెంబరు 30 : నాగర్‌కర్నూల్ జిల్లా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి పలు సమస్యలపై పత్రం అందజేశారు. మండల పరిధిలోని లక్నారంలో స్కూల్ వంటగది, ఉపాధ్యాయుల కొరత, స్కూల్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకున్నదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలో పశువుల దవాఖాన లేక రైతులకు ఇబ్బందికరంగా మారిందని కనీసం పశువుల స్టాండ్ కూడా లేకపోవడం శోచనీయంగా మారిందని, గ్రామంలో డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. సీసీ రోడ్ల నాణ్యత లేకపోవడం గుంతలు పడి అక్కడ వాటర్ చేరుకోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఆవంచ సాల్వాచారి, ఉపాధ్యక్షుడు కుత్ర బాలు, ప్రచార కార్యదర్శి ఎర్రోళ్ల పరుశరాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు జీటీ.శ్యామ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కొల్లాపూర్, సెప్టెంబరు 30: పేద విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజులను, ఫీజురీఎంబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుకు లిఖితపూర్వక వినతి అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్, కలర్ మహేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజురీఎంబర్స్‌మెంట్ నిధులు రూ.8,500 కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, ఆ నిధులను వెంటనే విడుదల చేసి ప్రభుత్వం పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 9నెలలు కావొస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, విద్యారంగ సమస్యలపై బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి సంఘం నాయకులు శ్రీరామ్, చక్రినాయుడు, పవన్‌గౌడ్, రాజు, సురేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో గుర్తు తెలియని మృతదేహం

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 30 : గుర్తు తెలియని మృతదేహం లభించడంతో జిల్లా ఆసుపత్రిలో ఉంచినట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... కొల్లాపూర్ చౌరస్తాలోని కలెక్టరేట్ కార్యాలయానికి సమీపంలో అపస్మారక స్థితిలో పడిన వ్యక్తిని జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా తెలిసినట్లయితే జిల్లా ఆసుపత్రిలో సందర్శించి గుర్తించాలని ఆయన సూచించారు.

ఫోన్ హ్యాక్‌తో డబ్బులు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 30 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సూర్యం శ్రీనివాసులు ఫోన్ హ్యాక్ కావడంతో డబ్బులు పోయినట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు సెప్టెంబరు 7వ తేదీన ఫోన్ హ్యాక్ కావడంతో 47వేల 970రూపాయలు స్వాహా అయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై సైబర్ కేసు నమోదు చేయడంతో నిందితుని బ్యాంక్ అకౌంట్ సీజ్ చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

చారకొండ, సెప్టెంబరు 30: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అద్దంకి సునిత అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజలు ఏవైన సమస్యలుంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరిస్తారని అన్నారు. ప్రజావాణికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని తెలిపారు.

క్షేత్ర స్థాయి పర్యటనలో పీజీ విద్యార్థులు

కొల్లాపూర్, సెప్టెంబరు 30 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పీజీ కళాశాల సోషల్ వర్క్ విద్యార్థులు క్షేత్రస్థాయి అధ్యాయనం చేయడానికి సోమవారం విశాఖపట్నం, అరకు బయల్దేరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియత్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, ఇందులో గిరిజనుల యొక్క స్థితిగతులు, ఆయా ప్రాంతాల పరిస్థితి, సామాజిక అంశాలపై విద్యార్థులు అధ్యాయనం చేయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు దేవరాజ్, డాక్టర్ ఎల్.వెంకటేశం పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గిరిజన మహిళ



బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కమలను సన్మానిస్తున్న దృశ్యం

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 30: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కా ర్యవర్గ సభ్యురాలిగా మం డల పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కమలను నియ మించినట్లు బీజేపీ మహి ళా అధ్యక్షురాలు బల్మూరి జానకి అన్నారు. గిరిజన మహిళ ఎన్నికైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బా లాజీతో కలిసి ఆమెను సోమవారం శాలువాతో సత్కరించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు, నాయకునికి తప్పనిసరి పదవి లభిస్తుం దన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌తో పాటు జిల్లా నాయ కులకు, నియోజకవర్గ నాయకులకు కమల కృతజ్ఞతలు తెలి పారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మొక్తాల రేణయ్య, నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో ఆకుపచ్చ తెగుళ్లు

బల్మూరు, సెప్టెంబరు 30 : వరి సాగులో జింకు లోపంతో ఆకుమచ్చ తెగుళ్లు వస్తున్నాయని వాటి నివారణకు రైతులు తగిన సూచనలు తీసుకుని మందులను వాడాలని వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మైలారం గ్రామంలో వ్యవసాయ రైతుల పొలాల్లో విస్తృతంగా వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చతెగుళ్ల నివారణకు జీలీటెక్స్, హైక్రోజల్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా మొక్కజొన్నలు వేసుకున్న రైతులు మండల వ్యాప్తంగా 5320 ఎకరాలు భూమిలో మొక్కజొన్న పంట సాగైందని, ప్రస్తుతం కడెం కంకి దశలో కత్తెర పురుగు కనబడుతుందని రైతులు తెలుపుతున్నారన్నారు. కోత దశగా ఉండటంతో రైతులు ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవద్దని రైతులకు సూచించినట్లు వారు తెలిపారు.

'ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే హైడ్రా లక్ష్యం'

వంగూరు, సెప్టెంబరు 30: ప్రభుత్వ ఆస్తులను కాపాడటం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చి అక్రమకట్టడాలను తొలగిస్తున్నారని అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని చెరువులు, నాలాల మీద ఉన్న అక్రమ కట్టడాలను కూల్చితేనే నగరం మనుగడ సాధిస్తుంద న్నారు.

విజయవంతమైన మెడికల్ క్యాంప్

ఉప్పునుంతల, సెప్టెంబరు 30: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సఫాయి మిత్ర మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య క్యాంపునకు మండంలోని 27 గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్వప సఫాయి కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌లాల్, ఎంపీవో నారాయణ, వైద్య సిబ్బంది ప్రభావతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్ తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

తాడూరు, సెప్టెంబరు 30 : తాడూరు సింగిల్ విండోలో పని చేసే సిబ్బంది అందరూ ప్రతినిత్యం మండలంలోని గ్రామాలకు చెందిన రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాల్సిందిగా సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సమృద్ధిగా అందే విధంగా రైతులకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈవో అంజనేయులు, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెల్దండ, సెప్టెంబరు 30 : రోడ్డుపై మేకలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళితే.. మండలకేంద్రం సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై వెల్దండకు చెందిన అంజద్ పెట్రోల్ బంకుకు వెళ్తుండగా, ఒక్కసారిగా మేకలు రోడ్డుపైకి రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. గాయాలుకాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

వెల్దండ, సెప్టెంబరు 30: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూర్‌కి చెందిన లక్ష్మమ్మ ఎవరికీ చెప్పకుండా సెప్టెంబర్ 29న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త కృష్ణయ్య ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఇటీవల వారికి చెందిన ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన లక్ష్మమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త కృష్ణయ్య హైదరాబాద్ నుంచి ఇంటికిరాగా లక్ష్మమ్మ కనిపించకపోవడంతో వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 30 : పోలీస్ సముదాయ కా ర్యాలయంలో సోమవా రం నిర్వహించిన ప్ర జావాణికి ఏడు ఫిర్యా దులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. తగు న్యాయం గురించి మూడు, భూమి పంచాయతీలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

పాలమూరు రంగారెడ్డి వట్టెం పంపుహౌజ్‌కు కరెంటు సరఫరా

కందనూలు, సెప్టెంబరు 30 : పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు వట్టెం పంపుహౌజ్‌కు కరెంటు సరఫరా సోమవారం అందించినట్లు ఏడీ రాజశేఖర్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... పాలమూరు రంగారెడ్డి పంపుహౌజ్ కరెంటు సరఫరా కోసం రూ.62కోట్లతో 400/11కేవీ కరెంటును స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మంజూరు చేయించారని ఆయన తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోని మోటార్లను నడిపేందుకు కరెంటు సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి సీఈ శ్రీరామ్‌నాయక్, ఎస్‌సీ మాణిక్‌రావు, ఏఈ హరిప్రసాద్, విజయలక్ష్మి ఉన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

ఉప్పునుంతల, సెప్టెంబరు 30: అంటరానితనాన్ని రూపుమాపాలని ఏఎస్సై రెడ్యానాయక్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కోరటికల్ గ్రామస్థులతో ఆంజనేయస్వామి ఆలయ ప్రవేశం ఏఎస్ఐ రెడ్యానాయక్ చేయించారు. ఆర్ఐ సుజాత, గ్రామస్థులు ఉన్నారు.